# స్వయంకృతం

ఆడపిల్లలు లేని తల్లితండ్రులు 'ఆడపిల్లో-ఆడపిల్లో' అని తపించిపోయినప్పుడు ఆడపిల్ల కలిగితే పడే ఆనందంకన్నా, ఆ పిల్లని పెంచి, పెద్దచేసి, మంచి కుటుంబంలో ఓ పిల్లవాడి చేతిలో పెట్టి, అత్తవారింటికి పంపి, ఆ పిల్ల హాయిగా ఆనందంగా ఉంది పరవాలేదను కున్నప్పుడు కలిగే ఆనందం రెట్టింపు. ఆ ఆనందం వర్ణనాతీతం. అది ఆడపిల్లల్ని కన్న ఎందరి తల్లితండ్రులకి లభ్యమవుతుంది?! అవుతోంది??

ఇద్దరబ్బాయిల తరువాత పుట్టింది సాహితి. సాహితి పుట్టడానికి ముందు ఈసారి ఆడపిల్లనివ్వమని మొక్కిన దేముడిని మొక్కకుండా మొక్కేరు అన్నపూర్ణమ్మ సారథిగార్లు. వాళ్ళు కోరుకున్నట్లు ఆడపిల్లే పుట్టింది. పార్వతి బొమ్మలాగుండే సాహితి పుట్టిన దగ్గర నుంచీ ప్రతీ వేడుకా ఎంతో ఘనంగా జరిపించారా దంపతులు.

అక్షరాభ్యాసం చేసి బడిలో వేసిన దగ్గరనుంచీ వారికి సాహితీ ధ్యాస మరీ ఎక్కువ కాసాగింది. పిల్లకి చదువెలాగ అబ్బుతుందో! సరిగ్గా చదువు రాకపోతే ఈ రోజుల్లో పెళ్ళిళ్ళు అవడం కష్టం. ఏం చదువుతుందో! ఎలా చదివించాలో! అన్న దిగులు ఎక్కువ కాసాగింది.

ప్రతీ క్లాసులోనూ మంచి మార్కులతో, మంచి రేంకు తెచ్చుకొస్తున్న సాహితిని చూసి "అమ్మయ్య పరవాలేదులే!" అనుకున్నారా దంపతులు.

ఆ తరువాత యౌవ్వనంలో అడుగిడుతున్న సాహితి పట్ల మరొక బెంగ పట్టుకుందా తల్లితండ్రులకి – "ఈడొచ్చిన పిల్ల సవ్యంగా వుంటుందా? ఈ పిల్లవున్నా మగపిల్లలు కొందరు వుండనిస్తారా" అన్న బెంగ, భయంతో సాహితి కాస్త ఆలస్యంగా యింటికి వస్తే కంగారూ, గాబరాతో వీధి వాకిలి వద్దే ఆమె కోసం ఎదురుచూపులు చూస్తూ, పిల్ల రాగానే "ఎందుకింత ఆలశ్యమయిందమ్మా!" అంటూ ఆదుర్దాగా తల్లితండ్రులు వేసే ప్రశ్నల్ని గ్రహించలేనంత తెలివితక్కువదేం కాదు సాహితి.

ఆడపిల్ల అన్న అభిమానంతో అపురూపంగా కోరినదల్లా యివ్వడంతో బాటు, అతి జాగ్రత్తగా పెంచిన పిల్ల డిగ్రీ పూర్తిచేసింది. ఆ తరువాత పి.జి. కూడా పూర్తిచేస్తున్న టైము నుంచే పెళ్ళి సంబంధాలు వెతకసాగారు తల్లితండ్రులు.

సాహితి పి.జి. కూడా పూర్తిచేసి కాలక్షేపానికి ఓ స్కూల్లో టీచరుగా చేరింది. పాతికేళ్ళొచ్చిన కూతురికి మంచి సంబంధం చెయ్యాలన్న తపనతో తల్లీతండ్రీ ఓ మోస్తరు సంబంధాల

గురించి ఆలోచించేవారు కాదు. చిట్టచివరికి హైదరాబాద్ వాస్తవ్యులు ఆనందం, నిర్మలమ్మ గార్ల కొడుకు చాలా నచ్చాడు. వాళ్ళకి యిద్దరే అబ్బాయిలు. పెద్దబ్బాయి చేతన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. అమెరికాలో ఉంటున్నాడు. రెండోవాడు కుందన్ కూడా ఇంజనీరే! ఢిల్లీలో ఓ మంచి కంపెనీలో అతనూ ఉద్యోగం చేస్తున్నాడు.

భారతదేశానికి వచ్చి ఉన్న చేతన్ సాహితిని చూసి పెళ్ళికి ఒప్పుకున్నాడు. కట్నకానుకలు కోరినన్ని యిచ్చి పెళ్లికి ముహూర్తాలు వారం రోజుల్లో పెట్టించాలంటే సరే అన్న సారథీ అన్నపూర్ణగార్ల ఆనందానికి అవధులు లేవు.

'కోటలో పాగా వేసాం' అన్న ఆనందం వాళ్ళని ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది.

మగపెళ్ళివారు కోరిన దానికంటే ఎక్కువే యిచ్చి ఘనంగా జరిపించారీ పెళ్ళి. పుట్టింటా, అత్తింటా మూడేసి రాత్రుళ్ళూ అయ్యాకా సాహితిని తీసుకుని అమెరికాకి బయలుదేరాడు చేతన్.

సాహితికీ జీవితం పూలపాన్పులాగ అనిపిస్తోంది. మనసంతా దూదిపింజల్లా గాలిలో తేలిపోతోంది. "తల్లీ తండ్రీ తనని ఎంతో అపురూపంగా పెంచారు. అంతకంటే గొప్ప ఆనందనిలయానికి పంపిస్తున్నారు. అమెరికా అంటే మాటలా?! జీవితంలో ఒక్కసారి వెళ్ళి చూడాలనే వారెందరికి సాధ్యం? తానింక అక్కడే జీవించాలి. తన జీవితభాగస్వామితో యిక ముందంతా అక్కడే గడపాలి" అన్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

అటు అన్నపూర్ణమ్మ సారథిగార్లు కూతురు దూరదేశాలకి వెళ్ళిపోతోందన్న బెంగతో మనసు ఆర్ద్రమవుతూంటే, ఆడపిల్లని కన్నందుకు అన్నీ సవ్యంగా జరిపి, ఆ పిల్లని ఓ అయ్య చేతిలో పెట్టి బాధ్యత తీర్చుకున్నాం" అన్న ఆనందం కూడా మిళితమై కన్నీటితో కూతుర్ని సాగనంపారు.

అమెరికాకి వెళ్ళేకా వారంవారం ఫోన్లు చేయడం, అక్కడి వింతలూ విశేషాలు చెప్పడం, ఫోటోలు పంపడంతో పాటు రాసే ఉత్తరాలని చూసి ఆ తల్లిదండ్రుల ఆనందానికి హద్దులుండేవి కావు. ఆ ఉత్తరాలూ, ఫోటోలూ బంధుమిత్రులకి చూపించి ఎంతో పొంగిపోయేవారా దంపతులు.

ఓ రాత్రి తలుపుచప్పుడు కావడంతో అన్నపూర్ణమ్మ, సారథిగార్లు "ఎవరీ రాత్రివేళ?!" అన్న ఆశ్చర్యంతో వెళ్ళి తలుపు తీసారు. ఎదురుగా సాహితి. అవాక్కయి నిలబడ్డ తల్లితండ్రుల్ని చూసి ఒక్కసారిగా పెల్లుబుకొచ్చిన దుఃఖంతో సామాన్లు కింద పడేసి వారిని కౌగిలించుకుని రోదించసాగింది.

అనుభవజ్ఞులయిన తల్లితండ్రులు ఏదో జరిగి ఉంటుందని గ్రహించి, ముందు పిల్లని ఊరడించాలని సాహితిని లోపలికి తీసుకెళ్ళి సోఫాలో కూర్చోపెట్టారు. ఏదో చెప్పబోయిన సాహితిని వారించి "రేపు మాట్లాడుకుందాం తల్లీ! పడుకో–" అంటూ కూతురికి కాస్త కాఫీ యిచ్చి పక్కవేసి పడుకోపెట్టారు. కానీ ఆ తల్లితండ్రుల మనస్సులు మాత్రం ఏదో కీడునే

శంకిస్తున్నాయి. "ఏం జరిగింది? అల్లుడేమన్నా అన్నాడా? మంచివాడు కాదా?" అన్న ఆలోచనలు రాగానే తాము చేసిన పొరపాటు మొదటిసారి గుర్తుకొచ్చింది.

"అమెరికా సంబంధమనగానే సంబరపడిపోయామే తప్ప పిల్లవాడి మంచిచెడ్డలు తెలుసుకోకుండా పిల్లని యిచ్చేసాము. పిల్లాడి చదువూ, తల్లీ తండ్రీ కుటుంబం అంటూ సంతోషించామే తప్ప పిల్లాడి గురించి అక్కడ వాకబు చేసామా? నిజంగా ఎంత పొరపాటు చేసాం!" అన్న ఆలోచనలు బుర్రని తొలచసాగాయి.

మర్నాడు సాహితి చెప్పిన విషయాలు విన్నాక వీళ్ళు ఊహించిందే నిజమయింది. అల్లుడికి ఈ పెళ్లికి ముందే ఓ అమెరికన్ అమ్మాయితో సంబంధముందనీ, ఆమెకి ఓ కూతురనీ అదీ ఈ మధ్యనే తనకి తెలిసిందనీ చెప్పిన కూతుర్ని చూస్తూ చలించిపోయారా దంపతులు. సాహితిని ఎలా ఊరడించాలో తెలీటంలేదిద్దరికీ. ఎంతో అపురూపంగా పెంచిన కూతుర్ని చేజేతులా గోతిలోకి త్రోసామే!" అన్న బాధ వారి హృదయాలని పిండేస్తోంది.

అమెరికాలో ఉన్న భారతీయ స్నేహితులతో ఈ విషయం చెప్పి భారతదేశానికి టిక్కెట్లు తెప్పించుకుని, చేతన్‌కి చెప్పకుండా వచ్చేసానని చెప్పిన కూతుర్ని జాలిగా చూస్తూ, మూడు నెలలయినా తిరక్కుండా కూతురి జీవితం మూడు ముక్కలయిందని తెలిసిన ఆ తల్లితండ్రుల బాధ వర్ణనాతీతమయింది. వారు పైకి లేని గాంభీర్యాన్ని తెచ్చుకుని కూతుర్ని ఓదారుస్తూ, "వాడి సంగతి చూస్తాం" అని సాహితిని ఊరడించసాగారు.

ఢిల్లీలోనే ఉంటున్న సాహితీ మరిది కుందన్‌కి కబురంపి విషయమంతా చెప్పారు. కుందన్ అచేతనుడై అన్నీ విన్నాడు. తల్లితండ్రులకీ విషయం ఫోన్‌లో తెలిపారు. మర్నాడే బయలుదేరి ఆనందం, నిర్మలమ్మగార్లు పరిగెత్తుకువచ్చారు.

తన కూతురి జీవితాన్నలా నాశనం చేసినందుకు బాగా కడిగెయ్యాలని ఎదురుచూస్తున్న అన్నపూర్ణ సారథిగార్లు వారి బాధని చూసి నోటమాట రాకుండా నిలబడిపోయారు.

కొడుకు చేసిన తప్పుడు పనికి కసితీరా తిట్టిపోసారు. 'వాడు మాకు చచ్చాడు, ఇంక నువ్వే మాకు కొడుకు'వని కోడల్ని కౌగలించుకుని గోలగోల పెట్టారు. "నీకు తగిన న్యాయం చేస్తాం తల్లీ! నీ జీవితం యిలా మోడుబారిపోకూడదు. ఇక ముందు నీకు యిద్దరు తల్లులూ, యిద్దరు తండ్రులూ అంటూ సాహితిని అక్కున చేర్చుకున్నారు.

కాలం ఎవరి మంచి చెడ్డలతో నిమిత్తం లేకుండా నడచిపోతోంది. సాహితి గడచిన రోజుల్ని దుస్వప్నంగా భావించి, మర్చిపోయి పిహెచ్.డి చేయడంలో నిమగ్నమై పోయింది. అత్తమామలు వచ్చి సాహితిని చూసి వెళ్తుండేవారు. సెలవులకి సాహితిని వాళ్ళ ఊరు తీసుకెళ్ళేవారు. అనుకున్న దానికంటే ముందే సాహితి డాక్టర్ సాహితిగా మారి కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. తన కాళ్ళ మీద తాను నిలబడ్డ సాహితిని చూసి తల్లితండ్రులే కాకుండా, అత్తమామలు కూడా ఎంతో ఆనందించారు. మరిది తరచూ వచ్చి సాహితిని పలకరించి వెళ్ళేవాడు.

గడిచింది పీడకలగా మర్చిపోయి భవిష్యత్‌కి పూలబాట వేసుకోవాలని సాహితీయే కాకుండా సాహితీ తల్లితండ్రులతో బాటు అత్తమామలు కూడా ఆలోచించసాగారు. సాహితిని యిష్టపడేవాడికిచ్చి పెళ్ళి చేస్తే ఆమె జీవితం ఓ గమ్యానికి చేర్చినవాళ్ళం అవుతాం అన్న ఆలోచన యిటూ, అటూ వుండేది. సాహితితో పెళ్ళిమాట "ఎలా ఎత్తడమా!!" అని ఆలోచించేవారు. ఆమె జీవితం మోడుబారడానికి కారకులం "మేమంటే, మేము" అని బాధపడేవారు యిరువైపులవారూ!

అకస్మాత్తుగా ఊడిపడ్డాడో రోజు చేతన్. తలుపు తీసిన తల్లీ తండ్రీ తలవంచుకుని నిలబడ్డ కొడుకుని చీత్కారంతో చూసారు. చేతిలో సామాను దింపి వాళ్ళ కాళ్ళు పట్టుకుని గోడుగోడుని దుఃఖించసాగాడు. "నాకు కొడుకేలేడు ముందు బైటికినడు" అంటూ వీధి వాకిలివైపు చూపిస్తున్న ఆనందంగారి కాళ్ళు పట్టుకుని క్షమార్పణలు చెప్పుకోసాగాడు. తల్లి హృదయం కాస్త కరిగి కొడుకుని లోపలికి రానిచ్చింది.

తరువాత నెమ్మదిగా విషయం బైటపెట్టాడు. అమెరికా వనితకి తనమీద మోజు తీరిపోగానే మరో అమెరికన్‌తో వెళ్ళిపోయిందని, కూతుర్ని బోర్డింగ్‌లో చేర్పించిందని, తన ఆస్తి అంతా కాజేసిందనీ ఆ వూళ్ళో తలెత్తుకోలేక ఇక్కడికి వచ్చేసాననీ చెప్పగానే ఒక ఆడపిల్లకి అన్యాయం చేసి ఆమె జీవితాన్ని నాశనం చేసావు. ఆ ఉసురు వూరికేపోదురా! నీకు దేముడు తగిన శాస్తి చేసాడు. నీ ఖర్మానికి నువ్వు బాధపడు వీలయినంత త్వరగా మాయింటి నుంచి వెళ్లు" అంటున్న తల్లితండ్రుల్ని చూసి ఏమీ అనలేక సామాను తీసుకుని బైటికి వెళ్ళాడు.

ఎక్కడికెళ్ళాలో తోచని చేతన్ తమ్ముడు గుర్తొచ్చి ఢిల్లీలోని కుందన్ రూమ్‌కి వెళ్ళాడు. అకస్మాత్తుగా ఊడిపడ్డ అన్నగార్ని చూసిన కుందన్‌కి ఏం మాట్లాడాలో తెలీలేదు. చేతన్‌ని చూస్తుంటే అసహ్యం కలగసాగింది. పెద్దవాడన్న గౌరవంతో మౌనంగానే తన కోపాన్ని అణచుకున్నాడు. మాటలతో తూలనాడకుండా ముఖంలో తన భావాలని కనబరుస్తున్న తమ్ముడిని చూస్తుంటే మరీ బాధనిపిస్తోంది చేతన్‌కి. తమ్ముడికి కూడా జరిగినదంతా చెప్పి కళ్ళనీళ్ళెట్టుకోసాగాడు. సాహితీ దగ్గరకెళ్ళి తను చేసిన తప్పును ఒప్పుకొని క్షమార్పణ అడగాలని వుందని వ్యక్తం చెయ్యగానే మాత్రం త్రాచుపాములా లేచాడు కుందన్. 'అన్నయ్యా! నీ దగ్గరనుంచి వచ్చిన తరువాత సాహితీ పడ్డ మనోవ్యధ నీకు తెలుసా? ఆ మూడు నెల్లనీ ఓ పీడకలగా మర్చిపోయి హాయిగా బ్రతుకుతోంది. ఆమె జోలికి వెళ్ళి మళ్ళీ గడచిన పాడు జీవితాన్ని గుర్తుచేసి ఆమెని హింసించకు. ఆమె వద్దకెళ్ళావంటే ఆమె తల్లితండ్రులు నిన్ను బైటికి ఈడ్చిస్తారు తెలుసా?" అంటున్న కుందన్‌వైపు వెర్రివాడిలా చూసాడు.

"ఆ – ఆడదేకదా! భర్త వచ్చి బ్రతిమాలితే రానంటుందా? ఏం చేస్తుంది?" అన్న అహం ఓ ప్రక్క యింకా ఉన్న చేతన్ కుందన్ మాటలకి ఖంగుతిన్నాడు.

అయినా ఓసారెళ్ళి పరీక్షిస్తే తప్పేమిటనుకుని సాహితిని కలవడానికి వెళ్ళాడు. తలుపు తీసిన సాహితి చేతన్‌ని చూడగానే ముఖం మీదే తలుపేసేసింది. "ఎవరమ్మా!" అని అడుగుతున్న తండ్రికి "ఎవడో అడుక్కునేవాడు నాన్నా! దుక్కలాగున్నాడూ" అంటూ యిచ్చిన సమాధానం విని తలదించుకుని వెనుదిరిగాడు చేతన్.

ఇప్పుడు చేతన్‌కి ఎక్కడా "నా" అన్న ఆత్మీయులు లేరు. అమెరికన్ భార్య పొమ్మంది. తల్లీ తండ్రీ బైటికెళ్ళమన్నారు. తమ్ముడు తిట్టకనే తిట్టాడు. సాహితి ఒక్కమాటయినా మాట్లాడకుండా చెప్పుదెబ్బలు కొట్టినట్లు తలుపేసేసింది.

"ఒక్క తప్పు నా జీవితాన్నెలా నాశనం చేసింది! ఇంక నా బ్రతుకింకింతేనా? ఏకాకిలా బ్రతకాలా? అన్న మనోవ్యధతో ఏదో చిన్న ఉద్యోగంలో చేరి, అందరికీ క్షమార్పణలు చెప్తూ ఉత్తరాలు రాసాడు.

ఆఫీసు నుంచి యింటికొచ్చిన చేతన్‌కి పోస్టులో వచ్చిన రెండు పెళ్ళి శుభలేఖలు చాలా ఆశ్చర్యాన్ని కలిగించాయి.

"ఎక్కడినుంచీ, ఎవరి పెళ్ళిళ్ళూ?" అంటూ కవరు తెరిచాడు. అది తండ్రి పంపిన శుభలేఖ. తమ్ముడి పెళ్ళి - ఎంతైనా తండ్రి కదా! తమ్ముడి పెళ్ళికి పిలవకుండా ఎలా వుంటాడు? వాళ్ళకి ఏమూలో నామీద యింకా ప్రేమాభిమానాలు లేకపోలేదు" అనుకుని పెళ్ళికూతురు ఎవరా?" అనుకుంటూ పేరు చూశాడు. శ్రీమతి అన్నపూర్ణ, శ్రీ సారధి గార్ల కుమార్తె చి॥ సాహితినిచ్చి వివాహము..." అని చదివిన చేతన్ కళ్ళు చీకట్లు కమ్మసాగాయి. నీరసంగా రెండో శుభలేఖ తీసాడు. అది సాహితీ పంపిన శుభలేఖ పేర్లు మాత్రం పైన క్రింద మారాయి. పై పేరు "సాహితీ" అని వుండడంతో తల్లీ, తండ్రీ, సాహితీ, తమ్ముడూ నామీద కక్ష తీర్చుకున్నారు" అనుకుంటూ వెర్రివాడిలా కుర్చీలో కూలబడిపోయాడు చేతన్.

**- అంజలి, మార్చి 2005**